సాక్షి
ములుగు

ఆదివారం | 7 | జూలై | 2024



అప్రమత్తత అవసరం..
వాహనాల కొనుగోళ్లలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. లేని పక్షంలో ఇబ్బందులు కొని తెచ్చుకోవాల్సిందే. - 8లో▸



శోభాయమానం..
శ్రీభద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి సహస్ర కళశాభిషేకోత్సవం శోభాయమానంగా జరిగింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కారుమబ్బులు..



వాజేడు: మండల కేంద్రంలోని బొగత జలపాతం వద్ద శనివారం సాయంత్రం ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. దీంతో భారీ వర్షం పడుతుందని పర్యాటకులు భావించారు. కాని ఒక్క చుక్క వర్షం కూడా పడకుండా మేఘాలు వెళ్లిపోయాయి. ఈ క్రమంలో కారుమబ్బులను చూసిన పర్యాటకులు ఆనందంతో కేరింతలు కొట్టారు.

11నుంచి స్కిల్ టెస్టులు

ములుగు: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయడానికి ఈనెల 11నుంచి 15వ తేదీ వరకు స్కిల్ టెస్టులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవిందరావుపేట మండల పరిధిలోని పస్రాలో గల జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించనున్న స్కిల్ టెస్ట్‌లకు స్లాట్‌ల వారీగా హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు అప్లికేషన్ అక్నాలేడ్జ్‌మెంట్ కార్డు, ఫొటో గుర్తింపుకార్డుతో హాజరుకావాలని తెలిపారు. మిగతా వివరాలకు హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్ 7013952246లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించాలని వెల్లడించారు. గత నెల 11న ప్రొవిజనల్ లిస్టును హెచ్‌టీటీపీ://ములుగుడాట్‌తెలంగాణడాట్‌జీఓవీడాట్‌ఇన్ లో పొందుపరిచి అభ్యర్థనలు స్వీకరించామని వివరించారు.

కార్మికులు విధులకు హాజరుకావాలి



భూపాలపల్లి రూరల్: సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికులు విధిగా విధులకు హాజరుకావాలని, హాజరయ్యే విధంగా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలని ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ సూచించారు. భూపాలపల్లి ఏరియా గైర్హాజరు ఉద్యోగుల అవగాహన కార్యక్రమం మైన్స్ రెస్క్యూ స్టేషన్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మూడు సంవత్సరాలలో 100 మస్టర్ల కన్నా తక్కువ హాజరు గల 69మంది ఉద్యోగులను పిలవగా 26 మంది ఉద్యోగులు హాజరయ్యారు. గైర్హాజరుకు కారణాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటరామరెడ్డి, జ్యోతి, అజ్మీర తుకారాం, శ్యాంప్రసాద్, సంజీవరావు, ప్రతిభ, గుర్తింపు సంఘం నాయకులు విజేందర్, ప్రాతినిధ్య సంఘం నాయకులు, గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి



భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను కార్పొరేట్ కంపెనీలకు వేలం వేయకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కొరిమి రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు. ఈనెల 12వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి వచ్చి సింగరేణి సంస్థను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కోసం భూపాలపల్లి జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యను అభ్యసిస్తూ ఉపకార వేతనం పొందడం కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లా కార్యాలయంలో లేదా 99892 92091 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పత్తికే ప్రాధాన్యం

ఉమ్మడి జిల్లాలో సాధారణ విస్తీర్ణం 15,50,643 ఎకరాలు

- ఇప్పటి వరకు సాగైంది 5,37,043 ఎకరాలు
- పత్తి సాధారణ విస్తీర్ణం 6,10,776
- సాగైన పత్తి విస్తీర్ణం 4,27,763
- ఆ తర్వాతే మిగతా పంటలు



కమలాపూర్, కానిపర్తి గ్రామాల శివారులో సాగు చేసిన పత్తి పంట

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులు పత్తి సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిగతా పంటలతో పోల్చుకుంటే.. ఇప్పటి వరకు పత్తి సాగు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. మెట్ట పంట అంటే.. పత్తి పంటే అనేలా రైతులు పత్తి సాగు చేస్తున్నారు. ఇతర మెట్ట పంటల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ప్రధాన వాణిజ్య పంట కావడంతో పాటు రైతుకు లాభదాయకంగా ఉండడంతో రైతులు పత్తి సాగుపై దృష్టి సారించారు. జూన్ ఆరంభంలో వర్షాలు కురవడంతో కొంత మంది రైతులు పత్తి సాగు చేయగా.. ఆతర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో పత్తి విత్తనాలు విత్తిన రైతులు ఆందోళనలో పడ్డారు. మొలకలు వాడిపోవడంతో పాటు, దుక్కిలో వేసిన విత్తనాలు పాడయ్యాయి. జూన్ చివరి వారం నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు వేస్తున్నారు. అది కూడా పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఇతర పంటలైన పప్పు దినుసులు, జొన్నలు, నువ్వులు వంటి పంటల వైపు కన్నెత్తి చూడడం లేదు. పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

ఊపందుకోని వరి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని పంటలు కలిపి సాధారణ విస్తీర్ణం 15,50,643 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 5,37,043 ఎకరాల్లో సాగైంది. ఇందులో పత్తి సాధారణ విస్తీర్ణం 6,10,776 కాగా.. ఇప్పటి వరకు 4,27,763 ఎకరాల్లో సాగైంది. పత్తి తర్వాత ఇప్పటి వరకు మొక్కజొన్న రెండో స్థానంలో ఉంది. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 73,087 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 25,797 ఎకరాల్లో సాగైంది. పప్పు దినుసులకు బాగా డిమాండ్ ఉన్నప్పటికీ రైతులు మాత్రం సాగు వైపు ఆసక్తి చూపడం లేదు. కంది సాధారణ విస్తీర్ణం 22,295 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 5,121 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కంది సాగు చేయలేదు. వరంగల్, మహబూబాబాద్, జనగామ జిల్లాలో మాత్రం స్వల్పంగా సాగు చేశారు. పెసర సాధారణ విస్తీర్ణం 6,945 ఎకరాలు కాగా, 6,045 ఎకరాల్లో సాగు చేశారు. ములుగు జిల్లాలో సాగు చేయలేదు. జొన్న మాత్రం ఒక్క జనగామ జిల్లాలో 50 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. వరి సాగు ఇంకా ఊపందుకోలేదు. నారు పోసి సిద్ధంగా ఉన్నారు. వరి సాధారణ సాగు విస్తీర్ణం 8,03,182 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 1,626 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో వరి సాగు ఆలస్యమవుతోంది. భూగర్భ జలాలతో సాగు చేసుకునే రైతులు నార్లు పోసుకుని సిద్ధంగా ఉన్నారు. సాగు నీరు అందుబాటులో ఉన్న మేరకు కొందరు రైతులు ముందుగా పోసుకున్న నారుతో నాట్లు వేస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురువలేదు. చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. దీంతో భూగర్భ జలాలు కూడా అంతంత మాత్రమే అందుబాటులో ఉన్నాయి. భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లోకి నీరు చేరితేనే వరి సాగు ఊపందుకునే అవకాశముంది.

అన్ని పంటలు కలిపి సాగు ఇలా..

జిల్లా	సాధారణ విస్తీర్ణం (ఎకరాల్లో)	సాగైంది (ఎకరాల్లో)
వరంగల్	2,82,431	1,24,126
హనుమకొండ	2,45,350	80,902
మహబూబాబాద్	3,31,587	1,33,350
ములుగు	1,28,286	16,859
జేఎస్ భూపాలపల్లి	2,12,896	75,891
జనగామ	3,50,093	1,05,915

పత్తి సాగైంది ఇలా..

జిల్లా	సాధారణ సాగు (ఎకరాల్లో)	సాగైంది (ఎకరాల్లో)
వరంగల్	1,29,936	96865
హనుమకొండ	1,00,350	73,731
మహబూబాబాద్	92,693	78,332
ములుగు	26,100	13,185
జేఎస్ భూపాలపల్లి	1,07,070	71,225
జనగామ	1,54,627	94,425





నేడు వన మహోత్సవం

- హాజరుకానున్న మంత్రి సీతక్క

ములుగు: ములుగు మండలం జాకారం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నేడు చేపట్టనున్న వన మహోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క హాజరుకానున్నారు. ఈ మేరకు డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 10గంటలకు అధికారులతో కలిసి గురుకుల ఆవరణలో మంత్రి సీతక్క మొక్కలు నాటనున్నారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2024 విద్యా సంవత్సరానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ పాణిని శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 15వ తేదీ వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సరుకులు నాసిరకంగా ఉంటే టెండర్లు రద్దు

- ఐటీడీఏ ఏపీఓ వసంతరావు



టెండర్‌దారులతో మాట్లాడుతున్న అధికారులు

ఏటూరునాగారం: గురుకులాల్లోని విద్యార్థులకు సరఫరా చేసే సరుకులు నాసిరకంగా ఉంటే టెండర్లు రద్దు చేస్తామని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో టెండర్లను శనివారం ఓపెన్ చేసి గుత్తేదారులకు వస్తువుల సరఫరాను అప్పగించారు. ఈ సందర్భంగా ఏపీఓ వసంతరావు మాట్లాడుతూ వరంగల్ రీజియన్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, యాకూబ్‌పుర, నర్సంపేట, ఎంసీపల్లి, సైనిక్ స్కూల్ అశోక్ నగర్, పర్వతగిరి, జనగామ, పాలకుర్తి మండలాల్లో ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు మటన్, చికెన్, కోడిగుడ్లు, కూరగాయల సరఫరా కోసం గతంలో టెండర్లను ఆహ్వానించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు నాణ్యమైన సరుకులను తీసుకోవాలని, స్టాక్ వచ్చినప్పుడు ఖచ్చితంగా తనిఖీలు చేసి స్టోర్ బుక్‌లో ఎంటర్ చేసి నిల్వలు సరిచూసుకోవాలని ఆదేశించారు. సరుకుల్లో నాణ్యతలేకుంటే టెండర్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ గుత్తేదారులు ఈ విద్యా సంవత్సరానికి సరుకులు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. నిబంధనలను పాటిస్తూ సకాలంలో వస్తువులు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ వెంకన్న, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, హన్మకొండ, వరంగల్ ఏఓలు పశురాం, రమేష్‌లు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ టీఎస్.దివాకర



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర, పక్కన వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

ములుగు: ములుగును డెంగీ, మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై జిల్లాస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో చాలా మంది చెరువులు, వాగులు, చెలిమల నీటిని తాగుతున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ఆ నీరు తాగవద్దని సూచించారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులకు సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. పాఠశాలల్లో బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. గొత్తికోయ గూడేలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ మలేరియా, డెంగీ నివారణకు పాటుపడాలని సూచించారు. గ్రామాల్లో శానిటేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే మూడు నెలలకు అవసరమైన మందులు, పరీక్ష కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డెంగీ, మలేరియా కేసులకు తగిన చికిత్సను అందించి అత్యవసరమైతే వేరే ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులు, కీటక జనితా వ్యాధులకు వేర్వేరు వార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ నినాదంతో ఆరోగ్య శాఖ, ఉమెన్ హెల్త్ అండ్ చైల్డ్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ కార్యాచరణను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌లాల్, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, ప్రోగ్రాం అధికారి పోరిక రవీందర్, ఏటూరునాగారం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ సూపరింటెండెంట్ సురేష్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ జినకల దుర్గారావు, ఎంపీడీఓలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 10ని రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్



నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ నంబర్ 10ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు శనివారం అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు జిల్లా కేంద్రంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ అంగన్‌వాడీలలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, వర్కర్లకు 65 సంవత్సరాలు నిండిన వారు ప్రభుత్వం అందిస్తున్న బెనిఫిట్లు తీసుకొని విధులకు రాకూడదని అధికారులు సూచించారని తెలిపారు. టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ. 50 వేలు ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. టీచర్లకు రూ. 2లక్షలు, వర్కర్లకు రూ. 1లక్ష చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు అతి తక్కువ బెనిఫిట్లు ఇచ్చి రిటైర్మెంట్ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎండీ గఫూర్, గుండబోయిన రవిగౌడ్, ప్రవీణ్, టీచర్లు సరోజన, భాగ్యలక్ష్మి, ప్రేమకుమారి, వెంకటరమణ, సరిత, రమాదేవి, నిర్మల, రుక్మిణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌కాస్ట్‌ను సందర్శించిన సింగరేణి డైరెక్టర్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్–2, 3లను శనివారం సింగరేణి డైరెక్టర్ శ్రీనివాస్ సందర్శించారు. ఏరియా జీఎం హబీబ్‌హుస్సేన్‌తో కలిసి రెండు గనులను పరిశీలించి బొగ్గు ఉత్పత్తిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

రామప్పలో పర్యాటకుల సందడి



రామప్ప ఆలయంలో విద్యార్థుల సందడి

వెంకటాపురం(ఎం): చారిత్రక రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. వీకెండ్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు, విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి రామప్ప రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. పూజారులు పర్యాటకులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టత గురించి వివరించగా శిల్పకళ సంపద బాగుందని కొనియాడారు.



రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పర్యాటకులు

నిత్యం అదే తంతు..



ట్రాఫిక్‌లో చిక్కుకున్న స్కూల్ వ్యాన్

కాళేశ్వరం: జిల్లా ఆర్టీఏ, పోలీసు, మైనింగ్, రెవెన్యూ, టీజీఎండీసీ, ఇరిగేషన్ అధికారుల తీరు మారడం లేదు. నిత్యం ఇసుక లారీలు ట్రాఫిక్ జాంతో సామాన్యులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. మహదేవపూర్ మండలం కాళేశ్వరం టు మద్దులపల్లి, పలుగుల, కుంట్లం వరకు లారీలు రెండు వరుసల్లో రోడ్డును ఆక్రమించి ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు వెళ్లడానికి వీలులేకుండా రోడ్డు మారింది. శనివారం ఓ ప్రైవేట్ స్కూల్ వ్యాను సాయంత్రం విద్యార్థులను తీసుకొని పలుగుల వైపు వెళ్తుండగా.. లారీలు రెండు వరుసల్లో రోడ్డుపై ఉండడంతో స్కూల్ వ్యాన్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. దీంతో స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా అరగంట తర్వాత వచ్చి క్లియర్ చేశారు. డయల్ 100కు కాల్ చేసేంత ట్రాఫిక్ కష్టాలు ఉన్నా అధికారులు మొద్దునిద్ర వీడడం లేదు. గతంలో స్కూల్ సమయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో లారీలను ఓ చోట నిలుపుదల చేసేవారు.. కానీ ఇప్పుడు మాత్రం యధావిధిగా నడిపిస్తున్నారు. ప్రమాదాలు జరిగితే తప్ప అధికారులు స్పందించరనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మోరంచపల్లిలో బస్సులు ఆపాలని ధర్నా



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామంలో ఆర్టీసీ బస్సులు ఆపాలని డిమాండ్ చేస్తూ శనివారం మధ్యాహ్నం గ్రామస్తులు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మోరంచపల్లిలో గతంలో బస్సులు ఆపేవారని.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసినప్పటి నుంచి బస్సులు గ్రామంలో ఆపడంలేదన్నారు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దీంతో భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ ధర్నా వద్దకు వెళ్లి గ్రామంలో రిక్వెస్టు బస్టాప్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ములుగురూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ సైదులు సూచించారు. మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం నార్కోటిక్ బ్యూరో వరంగల్, ములుగు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్ డీఎస్పీ సైదులు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలుగా మారవద్దని తెలిపారు. డ్రగ్స్ వాడడం వల్ల మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతారని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్‌కు అలవాటు అయి జీవితాలు కోల్పోయిన వారి చిత్రాలను చూపించి డ్రగ్స్ నియంత్రణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ సీఐ రాజేష్, ములుగు సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి, శ్రీధర్ పాల్గొన్నారు.


అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు భద్రకాళి శేషు.. వరుసగా పాలాభిషేకం,చందనాభిషేకం, నేయాభిషేకం, పన్నీరు గులాబీ అభిషేకం, విబూదాభిషేకం, గంధాభిషేకం,చక్కరాభిషేకం,పెరుగాభిషేకం, గులాల్‌తో అభిషేకం, కుంకుమాభిషేకం - సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఖిలా వరంగల్ : వరంగల్ గవిచర్ల క్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మధ్య కోటకు చెందిన మహ్మద్ ఇబ్రహీం అలియాస్ నన్ను (45) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో గవిచర్ల క్రాస్‌కు బయలుదేరాడు. గవిచర్ల క్రాస్‌కు చేరుకోగానే బైక్‌ను కుక్క ఢీకొంది. దీంతో ఇబ్రహీం రోడ్డుపై పడడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జక్య, తల్లిదండ్రులు ఉన్నారు. సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య జక్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్రమత్తత అవసరం..

సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి
- రికార్డుల్లో పేర్లు చూడకపోతే అంతే..
- రవాణాశాఖ ఎంక్వైరీలో అనుమానాలు నివృత్తి చేసుకోవాలి

ఖిలా వరంగల్ : ప్రస్తుత రోజుల్లో అతి ముఖ్యమైన వాహనాలు బైక్, కారు. కిరాణం నుంచి.. ప్రయాణం వరకు ప్రతీ అవసరానికి ఈ వాహనాలను వినియోగిస్తున్నాం. ఒక్క మాటలో చెప్పాంటే ఈ ప్రయాణ సాధనాలు లేకుండా అడుగు బయట పెట్టడం సాధ్య కాదని చెప్పడంలో అతియోశక్తి కాదేమో. ఈ క్రమంలో ఇంత ముఖ్యమైన వాహనాల కొనుగోళ్లలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. లేని పక్షంలో ఇబ్బందులు కొని తెచ్చుకోవాల్సిందే.

పుట్టగొడుగుల్లా పాతవాహన కన్సల్టెంట్లు..

వరంగల్ మహానగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పాత వాహన కన్సల్టెంట్, షోరూంల్లో వాహనాలు కొనుగోలు చేసే సమయాల్లో వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. సాధారణంగా కొత్త బైక్ కొంటే వాహనదారుడు పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటాడు. దీనిలో ఎలాంటి ఇబ్బందులు లేవు. అయితే సెకండ్ హ్యాండ్ బైక్‌లు, కారులు కొనుగోలు చేసుకున్నప్పుడు వాటి రికార్డులు, ఆర్‌సీబుక్, ఇన్సూరెన్స్, రోడ్డు టాక్స్ వంటి వాటిని చూడడం సర్వసాధారణం. ఈ క్రమంలో ఆయా జిల్లాల రవాణాశాఖ కార్యాలయంలో ఆ వాహనం ఎవరి పేరున ఉంది? దాని పరిస్థితి ఏమిటి? అనే విషయం తెలుసుకోలేకపోతే ఇబ్బందులు తప్పవు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న బైక్‌లు

దోపిడీలకు వినియోగించిన వాహనాల విక్రయం..

హత్యలు, దోపిడీలకు వినియోగించిన వాహనాలను కొంత మంది నేరగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా ఇతర జిల్లాలో విక్రయిస్తారు. వాటిని కొనుగోలు చేసిన అమాయకులు చిక్కుల్లో పడే పరిస్థితులు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రవాణాశాఖ.. వాహనాలకు సంబంధించిన డేటా మొత్తం ఆన్‌లైన్‌లో పొందుపర్చింది. దీంతో వాహనం కొనుగోలు చేసే ముందు ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారులను సంప్రదించి కేసుల వివరాలు సేకరించి సెకండ్ వాహనాలు కొనుగోలు చేయాలని అధికారులు తెలుపుతున్నారు. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వెబ్ సైట్‌ను ఓపెన్ చేసి వాహనం నంబర్ ఎంటర్ చేయగానే పేరు, అడ్రస్ ఇతర వివరాలు కనిపిస్తాయి. వాటి ఆధారంగా బైక్ లేదా కారు ఎక్కడైనా చోరీకి గురికాగానే వాహనదారుడి పేరు, ధ్రువీకరణ పత్రం, ఇన్సూరెన్స్ పత్రాల పరిశీలనతోనే తెలిసిపోతుంది. ధ్రువీకరణ పత్రాలు ఎక్కడైనా మార్పింగ్ జరిగినట్లు అనిపిస్తే వెంటనే ఆర్టీఏను సంప్రదిస్తే వాహన వివరాలు పొందొచ్చు. అతివేగంగా వాహనాలు నడిపిన వారికి, ప్రమాదం చేసి తప్పించుకుని తిరుగుతున్న వాహనాల వివరాలు కేసు నమోదును బట్టి తెలిసిపోతుంది. ఏదీ ఏమైనా సెకండ్ వాహనం కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు జాగ్రత్తలు పాటించకుంటే కష్టాలు తప్పవని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వాహనం కొనుగోలు చేసే ముందుకు ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారులను సంప్రదించాలని వారు సూచిస్తున్నారు.

పత్రాలు సరిచూసి కొనుగోలు చేయాలి



సెకండ్ హ్యాండ్ వాహనం కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ధ్రువీకరణ పత్రాలు సరిచూసిన వెంటనే ఆర్టీఏ కార్యాలయాన్ని సంప్రదించి వాహన వివరాలు తెలుసుకోవాలి. వాహన రిజిస్ట్రేషన్‌తో పేరు మార్పిడి జరుగుతుంది. వాహనం విక్రయించే వారు వెంటనే కొనుగోలుదారుడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలి. వాహనం కొనాలన్నా, విక్రయించాలన్నా ఆర్టీఏ నిబంధనలు పాటించాలి.

-జైపాల్‌రెడ్డి, ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

- 50.10శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈఏడాది ఏప్రిల్-మేలో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీవొకేషన్ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శనివారం సాయంత్రం రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి.. పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారితో కలిసి విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో మొత్తం డిగ్రీ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షలకు 46,130మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరుకాగా అందులో 23,114మంది విద్యార్థులు ఉత్తీర్ణత(50.10శాతం) సాధించారని పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి తెలిపారు. బాలురు 22,355మంది పరీక్షలకు హాజరుకాగా 8,465మంది ఉత్తీర్ణత(37.87శాతం) సాధించారు. బాలికలు 23,784 మంది పరీక్షలు రాయగా అందులో 14,649మంది ఉత్తీర్ణత (61.59శాతం) సాధించారు. ఉత్తీర్ణతలో బాలురకంటే బాలికలదే పైచేయిగా ఉంది. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు తిరుమలాదేవి, ఎ. నరేందర్, బీఎస్‌ఎల్ సౌజన్య, క్యాంపు ఆఫీసర్ ఆసిం ఇక్బాల్, క్యాంపు బాధ్యులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల విభాగం అధికారులు

ఉమ్మడి జిల్లాల వారీగా ఫలితాలు..

కేయూ పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ల పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 18,881 మంది విద్యార్థులకుగాను 9,657 మంది ఉత్తీర్ణత(51.15) సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11,809 మంది విద్యార్థులకుగాను 6,352మంది ఉత్తీర్ణత (53.79శాతం) సాధించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15,449మంది విద్యార్థులకుగాను 7,105మంది ఉత్తీర్ణత (45.99శాతం) సాధించారు. పరీక్షల ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చు

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసిన నేపథ్యంలో విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు. ఈనెల 7వ నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేసుకోవాలని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


గుంషావళి (ఫైల్)

గూడూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మర్రిమిట్టలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్కే. గుంషావళి (52) భార్య ఖైరుతో కలిసి కూలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉండగా వారికి పెళ్లిలు అయ్యాయి. కాగా, ఇటీవల గుంషావళి.. భార్యతో నిత్యం గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం భార్య ఇంటి ముందు ఉండగా గుంషావళి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది సమయం తరువాత ఇంట్లోకి వెళ్లిన భార్యకు భర్త వేలాడడం చూసి కేకలు వేసింది. ఆమె కేకలు విన్న పక్కింటి వారు వెళ్లి చూడగా అప్పటికే గుంషావళి మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : వరంగల్ బట్టలబజార్ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పక్క గల్లీలో ఈ నెల 1వ తేదీన జరిగిన కూలీ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. శనివారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ గోపితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ శివనగర్ వందన హైస్కూల్ వద్ద నివాసముండే ఇంగిల్కర్ రవీందర్.. వరంగల్ బస్టాండ్ వద్ద ఆంధ్రాహోటల్‌లో పనిచేసే వాడు. హోటల్‌లో పని మానేసిన అనంతరం యాచిస్తూ వెంకటేశ్వర స్వామి దేవాలయం దగ్గర నిద్రించేవాడు. అక్కడ అతడితో పాటు ఓ మానసిక దివ్యాంగురాలు నిద్రించేది. ఈ క్రమంలో 30వ తేదీ రాత్రి వీరభద్రచారి మద్యం సేవించి రాత్రి 12.30 గంటల సమయంలో మానసిక దివ్యాంగురాలు ఉన్న ప్రాంతం వద్ద నిద్రించాడు. ఆ సమయంలో రవీందర్ అక్కడికి చేరుకుని 'నువ్వు ఇక్కడ మహిళ పక్కన ఎందుకు పడుకున్నావు' అని వీరభద్రచారితో గొడవపడ్డాడు. ఈ గొడవలో వీరభద్రచారిని సీసీ రోడ్డుపై పడేశాడు. వెంటనే అక్కడ ఉన్న రాయితో తలపై మోదీ చంపేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టి నిందితుడు రవీందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఎస్సై నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయమానం.. సహస్ర కలశాభిషేకం


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమ్మవారికి సహస్ర కలశాభిషేకోత్సవం శోభాయమానంగా జరిగింది. ఉత్సవ కార్యక్రమాలు ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిర్మాల్యసేవలు అమ్మవారికి నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, ఉత్సవానుజ్ఞప్రార్థన, గౌరి గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, నాందీ, ఆయుష్యమన్త్రజపం, బ్రహ్మకూర్చహవనం, పంచగవ్యప్రాశనం, ఋత్విక్‌గ్వరణము, మధుపర్కవిధి, ప్రతిసరబంధము, వాస్తుయాగం, పర్యగ్నీకరణం, మత్సంగ్రహణం, వర్ధనీపూజ, యాగశాల ప్రవేశము, భూతోత్సాదనం, మండపస్థాణపూజ, ద్వారాతోరణపూజ, ధ్వజారోహణం, కర్కరీస్థాపనం, బలిప్రధానం, కుండసంస్కారం, అగ్నిప్రతిష్ఠ, సర్వతోభద్రవాస్తు యోగినీ, గణపతి నవగ్రహ క్షేత్రపాలమండలదేవతాయజనం నిర్వహించి కలశస్థాపన చేశారు.

ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి..

హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు అమ్మవారి సన్నిధిలో జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఈఓ శేషుభారతి, భద్రకాళిశేషు, అర్చకులు.. రాజేందర్‌రెడ్డి దంపతులను పూర్ణకుంభంతో స్వాగతించారు. ఎమ్మెల్యే ఆదిశంకరులను, వల్లభగణపతిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యేకు శేషవస్త్రాలు మహదాశీర్వచనం అందజేశారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఓరుగల్లును ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఆలయ మాడవీధుల నిర్మాణానికి గతంలో ఇచ్చిన రూ. 30కోట్లు, అదనంగా రూ. 70కోట్లతో భద్రకాళి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అదనపు నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్, రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షులు ఈవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి శరణంమమ..

సహస్రకలశాభిషేకం మధ్యాహ్నం ప్రారంభమైంది. అగ్నిపురాణంలో చెప్పబడిన విధంగా వేదపండితులు నాలుగు వేదాల మూలమంత్రాలు పఠిస్తుండగా భక్తులు భద్రకాళి శరణంమమ అంటూ చదువుతుండగా అమ్మవారికి అభిషేకం శోభాయమానంగా జరిగింది. దేవాలయ అర్చకులు అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. శీతలోదకం, ఉష్ణోదకం, పాలు, పెరుగు, నెయ్యి, తేనే, చెక్కెర,కొబ్బరి నీళ్లతో అభిషేకం జరిపారు. ఆ తరువాత మండలంలోని తొమ్మిది కోష్ఠాలలో మూలమంత్రాలతో తీర్థావాహన చేసి అమర్చిన 1008 కళశాలలోని ద్రవ్యాలను వేదపండితులు అమ్మవారి శిరస్సు పైనుంచి ధారగా అభిషేకించారు. కంచనకుంట్ల శ్రీధర్‌రెడ్డి, కీర్తి దంపతులు సహస్రకలశాభిషేకం దాతలుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని కాళీక్రమంలో అలంకరించారు. రాత్రి కామేశ్వరీనిత్యాక్రమంలో ఆవరణార్చనలు, సాయంతనపూజ, నీరాజనమంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ జరిపారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రిపోర్టర్ల పేరుతో బెదిరింపులు..

- దారి దోపిడీ ముఠా అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ కుమార్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కుమార్

వెంకటాపురం(కె): రిపోర్టర్ల పేరుతో మండలంలో కాంట్రాక్టర్లు, లారీ డ్రైవర్లు, వాహనదారులను బెదిరించి దారి దోపిడీకి పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం వెంకటాపురం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బండారి కుమార్ వివరాలు వెల్లడించారు. మండలంలోని వెంగళరావుపేటకు చెందిన వేల్పుల రామ్‌కుమార్, వేల్పుల నవీన్, ఎస్సీ మర్రిగూడేనికి చెందిన వేల్పుల మనోజ్ స్నేహితులు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీన ఓ లారీ.. ఛత్తీస్‌గఢ్‌లోని పామేడు నుంచి జగదల్ పూర్ మార్కెట్‌కు వెంకటాపురం మండలం మీదుగా వెళ్తోంది. మండలంలోని రామచంద్రాపురం సమీపంలో రాత్రి 11.30 గంటలకు రామ్‌కుమార్, నవీన్, మనోజ్ ప్రెస్ లోగో పట్టుకుని లారీని ఆపి డ్రైవర్ అనుముల్ కృష్ణను బెదిరించారు. అనంతరం డ్రైవర్ వద్ద ఉన్న రూ. 40 వేలు లాక్కున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబుతే చంపుతామని బెదిరించారు. అనంతరం శనివారం ఉదయం ముగ్గురూ.. వేల్పుల రామ్‌కుమార్ ఇంటి వద్ద కలుసుకుని ఇసుక లారీ, కాంట్రాక్టర్లను రిపోర్టర్ల పేరుతో బెదింపులకు పాల్పడి వసూలు చేద్దామని ప్లాన్ చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ముగ్గురు తమ నేరం అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి రూ. 32 వేల నగదు, ప్రెస్ లోగోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రిపోర్టర్ల పేరు చెప్పి ప్రజలపై అజమాయిషీ చేస్తూ బెదిరించడం, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి రావు తదితరులు ఉన్నారు.

సహకార సంఘాలతోనే పురోగతి

- టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: సహకార సంఘాల ద్వారా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పురోగతి సాధించవచ్చని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్నేని రవీందర్ రావు ప్రారంభించి మాట్లాడారు. సహకార సంస్థల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా 280 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు రమేశ్, మురళీధర్, రవి రాజా, పులిపాక శ్రీనివాస్, సాంపల్లి నర్సింహారావు, కాకతీయ సహకార ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ యాకుబ్, అధ్యాపకుడు రాజయ్య, డీసీసీబీ జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధుసూదన్, గంప స్రవంతి, గొట్టం స్రవంతి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మార్నేని రవీందర్ రావు

రుణాలు వసూలు చేయాలి

ప్రాథమిక సహకార సంఘాలు, డీసీసీబీ బ్రాంచ్‌ల ద్వారా ఇచ్చిన అన్ని రకాల రుణాలను వసూలు చేయాలని టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఆదేశించారు. శనివారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్లు, ప్రాథమిక సహకార సంఘాల సీఈఓలతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కర్షకమిత్ర, ఎల్‌టీ, పీటీఎల్, డెయిరీ, షీప్, ట్రాక్టర్, హార్వెస్టర్, జేఎల్‌జీ, మార్టిగేజ్ రుణాలు రికవరీ చేయాలన్నారు. రికవరీ కానీ రుణాలను లీగల్ యాక్షన్ ద్వారా వసూలు చేయాలన్నారు. డిపాజిట్ల టార్గెట్ సాధించి బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ల ఏర్పాటు

హన్మకొండ: వినియోగదారుల సమస్యల పరిష్కరించేందుకు, ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయడానికి ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిల్‌లు, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు, ఎస్ఏఓ, ఏఏఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ల ద్వారా ఫిర్యాదులు విశ్లేషించుకోవచ్చన్నారు. ఒకవేళ వినియోగదారుడు ఫిర్యాదుపై సంతృప్తి చెందకపోతే ఆ ఫిర్యాదు పునరావృతం అవుతుందన్నారు. ఈ ఫిర్యాదులను సంబంధిత ఎస్ఈ, డీఈ, ఏడీఈ, కార్పొరేట్ కార్యాలయం నుంచి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. అన్ని సర్కిళ్లలో విద్యుత్ బిల్లులపై క్యూ ఆర్ కోడ్ ముద్రించి వచ్చే నెల నుంచి జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.రాజుచౌహాన్, కె.తిరుమల్ రావు, కె.ఎస్.గుట్ట, కిషన్, జీఎంలు గౌతమ్ రెడ్డి, దేవేందర్, కృష్ణ మోహన్, మల్లికార్జున్, నాగ ప్రసాద్, శ్రీనివాస్, శేషారావు, డీఈ ఐటీ కె.అనిల్ కుమార్, డీఈ టీ.శ్రీధరాచారి పాల్గొన్నారు.